



**(క్రిందటి నెల నుంచి కొనసాగింపు)**

IX

రవికి మరో శుభలేఖ వచ్చింది. ఇదివరకులా రిజిష్టరు పోస్టులో కాకుండా మామూలు పోస్టులోనే వచ్చింది! ఇందిర మారిన నిజాయితీ మీద అందరికీ నమ్మకం కలిగినట్టున్నది! ఇది ప్రసాద్ గృహప్రవేశ ఆహ్వానపత్రిక, హైదరాబాద్లో ఉంటున్న తన చిన్న తమ్ముడు ఒక్కసారే రెండు ప్లాట్స్ కొన్నాడట. ఒక వారం వ్యవధిలో గృహప్రవేశాలు. శుభలేఖతోపాటు ఒక ఉత్తరమూ జతచేయబడింది.

"ప్రియమైన అన్నయ్య, గౌరవనీయులైన వదిన గారూ నమస్కారం. రెండు గృహప్రవేశాలు ఒకేరోజున ఏర్పాటు చెయ్యడానికి వీలు లేకపోయింది.అందువలన వేర్వేరు వ్యవధిలో ఏర్పాటుచేశాం, 'గృహప్రవేశాలకు మీరిద్దరూ, వంశీ కుటుంబమూ కూడా రావాలి. రెండు గృహప్రవేశాలు అయ్యేవరకూ మీరిక్కడే ఉండాలని నా కోరిక, మీరుండటానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నాను. అలాగే మన కుటుంబ సభ్యులందరూ కూడా ఆ వారం కలిసి ఉండే గొప్ప అవకాశం–వారంపాటు–తలచుకుంటూంటేనే ఎంతో ఆనందంగా ఉంది. ఇక గడిపితే వచ్చే సంతోషం చెప్పనలవికాదు. మన జీవితాల్లో ఇది మరో సువర్ణావకాశంగా భావించి మీ రాకకోసం ఎదురుచూస్తాను. ఈ వారం రోజులూ అమ్మానాన్న గారూ కూడ ఇక్కడుండటానికి అంగీకరించారు. నేను వంశీతో కూడా మాట్లాడతాను. కనీసం వాడు ఆ రెండవ గృహప్రవేశం టైమ్కన్నా వచ్చి మనతో కలుస్తాడని, కలవాలని వాడిని రిక్వెస్టు చేస్తాను. మీరూ, వదినా,వంశీ భార్యా, బాబూ మాత్రం ముందు రోజే రావాలి. వెంటనే రిజర్వేషన్స్ చేయించుకుంటారని నెలముందుగా శుభలేఖలు పంపుతున్నాను. ఉంటా?" రవి చేతిలోంచి తీసికుని ఇందిరా చదివింది.

"ఏమంటావు ఇందిరా, తమ్ముడి రిక్వెస్టుకు?"

ఏమాత్రం ఆలోచించకుండానే ఇందిర సమాధానం చెప్పింది.

"అంటానికేముందండీ మనం, రాధికా బాబూ తప్పక ముందుగా వెళ్లాలిసిందే! రెండు ఫంక్షన్స్లకు అటెండవటం, వారం అక్కడుండటం కూడ అవసరమే!"

" ఎంతమార్పు! మహాశ్చర్యం!"

"'ఎందుకలా ఆశ్చర్యపోతారు? మనమందరం కలసి ఆనందించడానికి ఇది పొడిగింపు! మీకు ఇంకోసారి చెబుతున్నాను. మన రాకపోకల గతానుభవాలను పీడకలలుగా మరిచిపోదాం."

రవి ఇంకా ఆశ్చర్యం నుండి తేరుకోలేదు. మళ్లీ ఇందిరే హెచ్చరించింది.

"మీ ఆశ్చర్య పర్వంనుండి మేల్కొని రిజర్వేషనుకు బయలుదేరండి. ఈలోగా నేనూ రాధికకి చెబుతాను."

రవికి ఆనందోత్సాహాలు. ఇందిరవైపు ఆప్యాయతా అనురాగపు దృక్కులు. ఇందిరా శుభలేఖ తీసుకుని రాధిక దగ్గరకు వెళ్లింది" అమ్మా రాధికా, ఏంచేస్తున్నావు?" అంటూ పిలవగా ఆ సమయంలోనే రాధిక చేతిలోనూ అదే శుభలేఖ!

"రండత్తయ్యా! మీ చేతిలో ఉన్న శుభలేఖే నాకూ వచ్చింది. చిన్న మామయ్యగారి గృహప్రవేశమట కదా!"

"అవునమ్మా! మనం వెళ్ళాలి, వంశీతోనూ మాట్లాడతానని ప్రసాద్ ఉత్తరంలో రాశాడు. వీలుంటే రెండవ గృహప్రవేశం నాటికయినా రమ్మని అడుగుతాడట!"

"'రెండు గృహప్రవేశాలకు మధ్య వారం వ్యవధి ఉందికదా మరిదేనికి వెళ్లాలి?"

" దేనికేమిటి, రెంటికీను. ఈ వారం మనకు అక్కడ స్టే ఏర్పాటు చేసే బాధ్యత ప్రసాద్దే! ఆ మాటా రాశాడు. మన ఫ్రండ్స్, చుట్టాలూ హైదరాబాదులో ఎలాగూ ఉంటారు. ఈ వంకని వాళ్లనీ కలవవచ్చు."

"మరి ఆయనతో చెప్పకుండా..."

"ఈ విషయం గురించి వంశీయే మాట్లాడొచ్చు. నీతో లేకపోతే మనమే మాట్లాడదాం. వెళ్లడం వెళ్లడమే".

"అలాగే అత్తయ్యగారూ!"

అత్తయ్య గారి హడావుడి చూస్తే, రాధిక తెగ ఆశ్చర్యపోయింది. బహుశా ఇదంతా కాకినాడ ఎఫెక్టు కాబోలు!

వెంటనే సంతోషంగా వచ్చిన ఇందిరని చూసి "ఇందిరా, ఏమంది నీ కోడలు??"

"'అంటానికేముందడీ, వెళ్లవలసిందే అని గట్టిగా చెప్పాను. అవసరమయితే వంశీతో మాట్లాడదాం అనీ చెప్పాను. సాయంకాలం మీరే వంశీతో మాట్లాడండి, రాధిక, నేనూ ఉండగానే",

"అల్లాగే" అని రవి అంగీకరించాడు.

సాయంకాలం 5 గంటలకి రవి, ఇందిరా రాధిక దగ్గరకు వెళ్లారు. రవి వంశీకి మిస్డ్ కాలిచ్చాడు. వెంటనే వంశీ రెస్పాండయ్యాడు.

"ఇంత క్రితమే చిన్నాన్న నాతో మాట్లాడాడు నాన్నగారూ! ఏదీ ఫోను రాధిక కివ్వండి." రాధిక ఫోనందుకుంది.

"రాధికా! చిన్నాన్నా నాతో మాట్లాడాడు. అమ్మ నాన్నలతో నువ్వూ బాబు గృహప్రవేశాలకి వెళ్లి రండి. వీలయితే 2వ గృహప్రవేశం టైముకయినా నేను వస్తాను."

"గతంలోనూ మీరిలాగే చెప్పారు, కృష్ణమోహన్ పెళ్లికి"

"ఏం చెయ్యను చెప్పు? అప్పుడు ముందుగా తెలియదు కదా! తప్పక ప్రయత్నిస్తాను. ఇది మనమందరం కలుసుకుని వారం పాటు ఆనందించే సమయం. ఇటువంటివి ఎప్పుడో కాని రావు. ఈ అవకాశాన్ని మనం జారవిడచుకోకూడదు. " స్థిరంగా చెప్పాడు వంశీ.

***

ప్రసాద్ గృహప్రవేశానికి ఒక రోజు ముందే రవి కుటుంబం హైద్రాబాదు చేరింది. ప్రసాద్ పని చేసేది పెద్ద కంపెనీ, అమెరికన్ బేస్డ్ కంపెనీ. దాంట్లో  ఒక పెద్ద గెస్ట్ హౌసు ఉన్నది. కంపెనీ హెడ్డాఫీసు నుండి ఇతర పెద్ద నగరాల నుండి తరచుగా ఎగ్జిక్యూటివ్స్ వస్తూంటారు. ఆ గెస్ట్ హౌసులోనే దాదాపు 30,40 మంది ఉండే ప్రొవిజన్ ఉన్నది. అన్ని సౌకర్యాలుతో పాటు ఒక కుక్ కూడా ఉంటాడు. తన గృహప్రవేశ సందర్భంలో ఇక్కడే తనవాళ్లనుంచడానికి కంపెనీ నుండి అనుమతి పొందాడు.

రవీ, ఇందిరా, రాధికా, బాబు డైరెక్టుగా అక్కడే చేరారు. అక్కడికే రవి తల్లితండ్రులు, జ్యోతి శివలు, తన పెద్ద తమ్ముడు రామచంద్రం దంపతులూ వాళ్ల పిల్లలూ అందరు ఒక చోట చేర్చబడ్డారు. కృష్ణమోహన్ ఎల్లాగూ ఒక ఫ్లాట్ తీసుకుని హైద్రాబాద్లోనే ఉన్నాడు. అట్లాగే అతని అక్కా బావలు అక్కడే ఉన్నారు. అక్కడే దిగినా చిన్నన్నయ్య రామచంద్రాన్నీ చిన్న వదినెననూ ప్రసాద్ తన రెసిడెన్సీకి తీసుకెళ్లిపోయాడు. గృహప్రవేశపు ఏర్పాట్లలో తనకూ, తన భార్యకూ సహకారం అందించడానికి, గృహప్రవేశం అయ్యే ఫ్లాటికి ప్రసాద్ రెసిడెన్స్ కీ దగ్గరే అవడం వలన ఇరుదోట్లనుండీ రాకపోకలు జరగడానికి తగిన ఏర్పాట్లు జరిగాయి.

గృహప్రవేశం ఉదయం 9 గంటలకి, అంతకుముందే బంధుమిత్రులు ఫ్లాట్కి చేరుకున్నారు.  కాఫీ, టిఫిన్లు అయ్యాక గృహప్రవేశముహూర్తం.

కాకినాడ కృష్ణమోహన్ పెళ్లినాటి వాతావరణం నెలకొన్నది. శ్రీరామచంద్రమూర్తిగారి పెద్దకుటుంబ సభ్యులందరూ ఒకరినొకరు పల్కరింపులు, యోగక్షేమాలు తెలుసుకోవడం – దీనికి తోడు హైద్రాబాద్లో ఉన్న వారి బంధుమిత్రులూ అక్కడకు చేరారు.  ఎటుచూసినా సంతోషం, ఉత్సాహం అన్నింటికి ప్రధాన ఆకర్షణ – ఈ పెద్ద కుటుంబంలోనికి రవి దంపతుల పునరాగమనం, కూడా వాళ్ల కోడలూ, బాబూ కూడ మరో ఆసక్తికరమైన విశేషం. ప్రసాద్ గృహప్రవేశాలుపూర్తియ్యాక ఎవరిళ్లకు వాళ్లుతిరిగి వచ్చేరు.

కోర్టువారుకేసుని మరో ఆరునెలలు వాయిదావేసి ఈలోపులో రవి కుటుంబం అదే ఇంట్లో ఉండవచ్చని తీర్పు చెప్పారు.

★★★

ఓ రోజు యుగంధర్ యాక్సిడెంట్లో చనిపోయినట్టు వార్త అందింది. రవి దంపతులు నిశ్చేష్టులయ్యారు. రవి చూసి సానుభూతి ప్రకటించి వచ్చేడు. దశావహం తర్వాత యుగంధర్ భార్య ఫోన్ విని రవి అక్కడికి వెళ్లాడు. ఆమె చెప్పిన సంగతులు విని నిశ్చేష్టుడయ్యాడు. ఆమె చెప్పిన దాని సారాంశం: "చనిపోయే ముందు ఆయన తన విల్లు రాసి రిజిష్టరు చేయించారు. దాని ప్రకారం యుగంధర్ ఇల్లు రివర్స్ మార్ట్ గేజులో ఉంది. యుగంధర్ దంపతులు——ఇద్దరు జీవించి ఉన్నంతవరకు ఇంటిలో ఉండవచ్చు. ఆ తర్వాత మార్టేజ్లోన్ బాకీ చెల్లించిన వారే ఇల్లు స్వాధీనం చేసుకుంటారు. దాని ప్రకారం ఆయన పోయారు గనుక  జీవితాంతం ఇంటి మీద సర్వహక్కులు భార్యకే.  తదనంతరమే అప్పు చెల్లించిన వారో, బ్యాంకువారో ఇంటిని స్వాధీనం చేసుకుంటారు".

ఈ విల్లు చదవడం పూర్తయ్యేసరికి యుగంధర్ పిల్లలకు ముచ్చెమటలు పోశాయి. తండ్రిని తిట్టుకుంటూ అందరూ వెళ్లిపోయారు.

ఇదంతా చెప్పి

“అన్నయ్య గారూ! ఇలాగే మీ పెద్దబ్బాయి మిమ్మల్ని ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడన్నారు. ఆ పరిస్థితే వస్తే మీరిక్కడకు వచ్చి ఒక పోర్షన్లో ఉండండి. మీరు తోడుండటం నాకు కొండంత అండ".

రవి "కోర్టు వాడికి అనుకూలంగా లేదమ్మా! మీ మంచి మనసుకు ధన్యవాదాలు. ధైర్యంగా ఉండండి. ఒకసారి మా శ్రీమతిని తీసుకుని వస్తాను" అంటూ ఆమెదగ్గర సెలవు తీసుకున్నాడు.

X

ఇందిర తండ్రి జానకిరామయ్య గారికి రాసిన ఉత్తరం మరోసారి చదువుకున్నారు.

"నమస్కారం. మీ ఉత్తరం నన్ను షాక్కి గురిచేసింది. మీకొచ్చిన కేన్సరు ప్రమాదకరమైనది. ఖర్చెంతయినా వెనుకాడక వైద్యం చేయించండి. ఇప్పటకే మీరు హైదరాబాద్లో కొంత వైద్యం చేయించుకున్నారు. బొంబాయిలో తాతా ట్రస్టు కేన్సర్ హాస్పిటల్ అని ఉన్నది. కేన్సర్ చికిత్సకిది మనదేశంలో గొప్ప హాస్పిటల్ అన్నయ్యను తీసుకుని అక్కడకు వెళ్లండి. వారు రానంటే నేనూ మీ అల్లుడు గారూ అక్కడకు వచ్చి బొంబాయి తీసుకుని వెళ్లే ఏర్పాట్లు చేస్తాం. మీ ఉత్తరం కోసం ఎదురు చూస్తాం."

కూతురు రాసిన ఉత్తరం చూపించకుండా జానకి రామయ్యగారు కొడుకులతో బొంబాయి ప్రయాణం గురించి చర్చించారు. వాళ్లు తండ్రిని తీసుకుని బొంబాయి వెళ్లడానికి ససేమిరా అంటున్నారు. అసలే ఆయన తమ కున్న రెండు ఎకరాలు అమ్మి అప్పులు తీర్చినందుకు గుర్రుగా ఉన్నారు. ఒక ఈ ఖర్చులెవరు భరిస్తారూ? అనేది వాళ్ల భయం. కొడుకుల రియాక్షన్ తెలియజేస్తూ ఆయన కూతురుకు ఉత్తరం రాశారు. ఈ ఉత్తరం చూసిన వెంటనే రవిదంపతులు ఏలూరు (జానకి రామయ్యగారు ఉండే చోటుకు) వచ్చి ఆయన్ని బొంబాయి తీసుకునివెళ్లారు. అక్కడ టెస్టులవీ చేసి “పోజిషన్ ఎంకరేజింగ్గా లేరు. మీరీయనను హైద్రాబాద్లో బసవతారకం కేన్సర్ హాస్పిటల్లో చేర్పించండి".అన్నారు.

రోగిని తీసుకుని రవి దంపతలు ఏలూరు తిరగి వచ్చారు. రవి ఇందిరతో

“హైదరాబాదులో డబ్బు చాలా ఖర్చువుతుంది. ఏంటిదారి?” అని ఆలోచించుకున్నారు.

ఇద్దరూ కలిసి జానకి రామయ్యగారితో చర్చించి ఆయనకి మిగిలిఉన్న ఇంటిని రివర్స్ మార్ట్గేజ్ చేయడమొకటే పరిష్కారంగా తేల్చుకున్నారు. ఇది కొడుకులకు తెలియకుండా చెయ్యాలి, ఇందిర అన్నయ్యలకు తెలియకుండా రివర్స్ మార్ట్గేజ్లోన్ తొమ్మిది లక్షల యాభైవేలు వచ్చేటట్లు రవి మేనేజ్ చేశాడు. 50,000/- ఏలూరులోనే జానకిరామయ్య దంపతులు జాయింట్ ఎకౌంట్లో ఉంచి మిగిలినది హైదరాబాదులో ఉన్న కృష్ణమోహన్ ఎక్కౌంట్ కు ట్రాన్స్ఫర్ చేయించాడు రవి.

అందరూ హైదరాబాద్ చేరి జానకిరామయ్యగారిని బసవతారకం హాస్పిటల్లో చేర్పించారు. భర్త తన తండ్రి పై చూపిస్తున్న శ్రద్ధకు ఇందిర కృతజ్ఞతతో తలమునకలవుతున్నది. గతంలో తన భర్తనీ అఫీషియల్ ప్రమాదం నుండి కాపాడిన ఉత్తముడైన ఈ కుర్రాడు, కృష్ణమోహన్ తన తండ్రిని హాస్పిటల్లో చేర్పించడమేగాక తన పలుకుబడి ఉపయోగించి తండ్రికి మంచి వైద్యమూ అందించే ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇంతటి ఉత్తమమైన తల్లిదండ్రులను తాను తన భర్తతో కలిసి అనేక అవమానాలు పాలు చేసింది. జ్యోతి జబ్బుతో బొంబాయి వస్తే తామప్పుడు బొంబాయిలో ఉండి కూడ ఒక్కనాడు ఆమెను చూడలేదు. ఈ పశ్చాత్తాపం తనను దహించివేస్తున్నది. జ్యోతి దంపతులకు, కృష్ణమోహన్కి ఆయురారోగ్యాలు కలిగాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించింది.

హాస్పిటలులో ఉన్నన్ని రోజులు కృష్ణమోహన్ రోగికి ధైర్యం చెప్పూ చూస్తూ డాక్టర్లతో మాట్లాడుతూ, తలలోనాలుకలో ప్రవర్తించాడు. జానకిరామయ్య రోగం క్రమక్రమంగా తీవ్రమై ఆయన్ని డాక్టర్లు పెదవివిరిచి ఇంటికి తీసుకుని పొమ్మని డిశ్చార్జ్ చేశారు. అందరూ ఏలూరుచేరిన మరునాడే ఆయన తుది శ్వాస విడిచాడు.

వెంటనే రవిద్వారా కబురు తెలుసుకుని మూర్తి దంపతులు, రామచంద్రం, ప్రసాద్ దంపతులూ, జ్యోతి దంపతులూ ఏలూరు చేరుకుని జానకిరామయ్య కుటుంబ సభ్యులనూ, ఇందిరనూ ఓదార్చారు.

అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా శేఖర్, చిన్నబాబు (జానకి రామయ్య కొడుకులు) లకు జానకి రామయ్య ఇల్లు రివర్స్ మార్ట్గేజ్లో ఉందని తెలిసి తోకతొక్కిన త్రాచుపాములా అందర్నీ ముఖ్యంగా రవిని తిట్టి తిట్టి వెళ్లిపోయారు. ఎవరు చెప్పినా తండ్రికి తలకొరివి పెట్టం అని తేల్చి చెప్పారు.

బాధ్యతంతా పరంధామయ్య, మూర్తి గారి మీద పడింది. బ్రాహ్మడుతో చర్చిస్తే" కొడకులు పెట్టకపోతే కూతురూ పెట్టవచ్చని కాని అల్లుళ్లు ప్రక్కనే ఉండాల"ని నిర్ణయించారు. జానకిరామయ్య పెద్దల్లుడు తాను భార్య తో కలిసి ఆమె తండ్రి తలకొరివి పెట్టడానికి నిరాకరించాడు. అది తన తండ్రి బ్రతికి ఉన్నాడుకనుక కుదరదని చెప్పేశాడు. ఇక మిగిలింది ఇందిర, రవి. అందరూ రవి వంక, మూర్తిగారి వంక చూశారు.

మూర్తి రవి వంక తిరగి

"'అబ్బాయి రవీ! నీ అభిప్రాయం ఏమిటి?"

"మీ యిష్టం నాన్నగారూ! నాకైతే అభ్యంతరం లేదు. దాని వలన దేవుడు లాంటి మీకేమి అశుభం జరక్కండా ఉండాలి. ఫైనల్గా మీరేమి చెబితే అదే చేస్తాం"

మూర్తి గారీ పరిస్థితిని ముందే ఊహించి ఒక నిర్ణయానికి రానే వచ్చారు.

"రవీ, ఇందిరా మీరిద్దరూ లకొరివి పెట్టడానికి నాకేం అభ్యంతరం శివుని ఆజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు. ఈ ఆచారాలు, నియమాలు మూర్ఖమైనవని నా నమ్మకం. సత్యం, మానవత్వం అసలైన నిజాలు. వాటి ననుసరించే వారికి ఎటువంటి హాని జరగదు. జరగాలిసిందంతా భగవంతుడు ముందే నిర్ణయించి ఉంటాడు. మనం నిమిత్తమాత్రులం. అందువలన నువ్వూ కోడలు ఏ రకమైన అనుమానాలు పెట్టుకోక ఈ కార్యక్రమాన్ని నెరవేర్చండి".

అక్కడున్న వారందరూ మూర్తిగారి నిర్ణయానికి ఆశ్చర్యంతో ఆయన కాళ్లకు నమస్కరించారు. ఇందిర కయితే మామగారి పెద్దమనసుకు ఆరాధనా భావంతో, కృతజ్ఞతతో నిండిపోయి ఆయన పాదాలను కన్నీళ్లతో తడిపింది. మూర్తి ఆప్యాయంగా ఆమె తల నిమిరి "ధైర్యంగా ఉండుతల్లీ! మేమందరం నీకూ నీ కుటుంబానికి అండగా ఉంటాం".

జానకిరామయ్య గారి అంత్యక్రియల్లో మూర్తిగారి మిగిలిన ఇద్దరు కొడుకులూ, కొడళ్ళూ కూతురూ, అల్లుడూ కూడా పాల్గొని తమ బాధ్యతని, నిజాయితీని నిరూపించారు. వాళ్ల పిల్లలతోసహా, స్వార్ధంతో, అసూయతో నిండిన తన అన్నలిద్దరూ కనుచూపు మేరలో లేనట్లు ఇందిర గుర్తించింది. "ఇటువంటి దైవస్వరూపులైన అత్తమామలను, తన ఆడపచునీ, ఆమె భర్తనూ, మరుదులనూ, తోటికోడళ్లనూ తాననేక సార్లు అమానించడమే గాక తన పిల్లలనూ, భర్తనూ కూడ వాళ్లతో కలవకుండా పరమ కిరాతకంగా ప్రవర్తించింది! ఇకనైనా తన ప్రవర్తనను సరిదిద్దుకుని మూరి గారి కుటుంబం యెడల కృతజ్ఞతా భావం కలిగిఉండాలి" అని ధృఢనిశ్చయానికి వచ్చింది.

అంత్యక్రియలకు రాకపోయినా జానకిరామయ్య కొడుకులు ఆయన చిన్నదినానికి, పెద్దదినానికి వచ్చి కర్మకాండ నిర్వహించేలా మూర్తిగారు వాళ్లను ఒప్పించి వాళ్ల చేతే ఆ పనిచేయించగలిగారు. ఇందిర మామగారి చాకచక్యానికి ఆశ్చర్యపోయింది.

రవి, ఇందిరా, మూర్తి దంపతులు తప్ప మిగిలిన మూర్తిగారి కుటుంబ సభ్యులందరూ అంత్యక్రియలయిన మరునాడు వాళ్ల ఊళ్లకు వెళ్లి పెద్ద కార్యం సమయానికి వచ్చి ఇందిరకు సంతృప్తిని కలిగించారు.

ఇందిర "మామయ్య గారూ! మీరు దైవస్వరూపులు! ఇది నేను ఆలస్యంగా తెలుసుకున్నాను. మన పెద్ద కుటుంబ సభ్యులతో నాప్రవర్తన క్షమించరానిది. అనేక అపార్థాలు కలగడానికి మీ మనస్సులు నొప్పించడానికి చెయ్యరానివి ఎన్నో చేయడమేగాక ఉత్తముడైన నా భర్తను ఈ నా దుర్మార్గపు పనుల్లో భాగస్వామిని చేశాను. అయినా మీరెప్పుడూ నన్నుపల్లెత్తుమాట అనలేదు. అత్తయ్యగారు, నన్నెప్పుడూ ఒక్క పరుషవాక్యంతో నిందించలేదు.

మిమ్మల్ని, క్షమించమని అడిగే అర్హత నాకు లేకపోయినా మమ్మల్ని క్షమించమని అర్థిస్తున్నాను." అంటూ ఇందిర మూర్తి దంపతుల పాదాలను మరోసారి కన్నీటితో కడిగింది.

రవి తల్లిదండ్రులకు నమస్కరించాడు.

"నాన్నగారూ! చిన్న ఉద్యోగంలో ఉండీ నాకు పెద్ద చదువు చెప్పించారు. చదువుకున్న అమ్మాయిని కోడలుగా చేసుకోవాలని నాకు పెళ్లిచేశారు. పెళ్లయిన క్షణంనుండీ – స్వార్థపరత్వంతో, నిర్లక్ష్యంతో మీకు దూరమవుతూ వచ్చాను. దానికి నా భార్యబలహీనత తోడయినా అసలు నేరస్తుడిని నేనే! మీలాంటి పుణ్యదంపతుల పెంపకంలో పెరిగిన నేను ఉత్తమ పౌరునిగా, ఉత్తమ పుత్రునిగా ఉండలేకపోవడం నా తప్పు! చిన్నవాడు కృష్ణమోహన్ చెప్పినట్లు నేను తప్ప మిగిలిన మీ ముగ్గురు సంతానం మీతోనూ, వాళ్లలోవాళ్ళూ వాళ్లకుటుంబాలతో కలిసిమెలిసి ఉంటున్నప్పుడు నేనొక్కడినే ఎందుకిలా మీకు దూరమయ్యాను? నా భార్యా బిడ్డలనూ మీకు, నా సోదరీసోదరుల కుటుంబాలకూ దూరం చేశాను! నా విచక్షణాజ్ఞానాన్ని గంగలో కలిపి, అనుబంధాలనూ, అనురాగాలను విసర్జించి, మీకష్టసుఖాల్లోను, సోదరీసోదరుల కష్టసుఖాల్లోను పాలుపంచుకోకపోవడం క్షమార్హం కాదు. అయినా మీరు వాటిని పట్టించుకోకుండా పెద్దమనసుతో మన కుటుంబ సభ్యులందరూ కలిసి ఉండే వాతావరణం కల్పించారు. ఇక నుండి సన్మార్గంలో నడుస్తానని, నా భార్యా పిల్లలతో సహా మన కుటుంబసభ్యులందరితో మమేకమవుతానని మీకు మాట ఇస్తున్నాను.. మమ్మల్ని క్షమించమని మరోసారి ప్రార్థిస్తున్నాను." చివరి మాటలంటుంటే రవి గొంతు మోగపోయింది.

పెద్దకొడుకునూ, కోడలినీ మూర్తి దంపతులు లేవనెత్తి తమ అక్కున చేర్చుకున్నారు. వాళ్లు సేద తీరేవరకు ఆగి "నాయనా రవీ! అమ్మా ఇందిరా! మీరు చేసిన పొరపాట్లన్నీ క్షాళనమైపోయాయి. మీ పశ్చాత్తాపం దురాగతాన్ని క్షమిస్తుంది!" అన్నారు.

**★★ అయిపోయింది.★★**

## రచయిత ముగింపు వాక్యాలు

పాత్రలూ – స్వభావాలు

– కొట్టి రామారావు రచయిత

1950 ప్రాంతాల్లో తెలుగులో వచ్చిన నవలలలో ఎక్కువ భాగం శరత్ బాబువి, బంకించంద్ర ఛటర్జీ వి, ప్రేమ్చంద్వి, రాగూర్ వి– కొన్ని ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువదింప బడినవే. ముఖ్యంగా శరత్ బాబు నవలలు విరివిరివిగా తెలుగులోకి అనువందింపబడ్డాయి. ఆరోజుల్లో శరత్ తెలుగు రచయితే అనుకునేంతగా ప్రసిద్ధుడు. మన గ్రామీణ వాతావరణానికి, బెంగాల్ వాతావరణానికి పోలికలు ఎక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. ఆ కాలంలోనే శ్రీపాద, విశ్వనాథ, బుచ్చిబాబు, గోపీచంద్, అడవిబాపిరాజు, మొదలైనవారి నవలలు వచ్చేయి. 1950 ప్రాంతాల్లో నేను శరత్ నవలలను, కథలు దాదాపు అన్నీ చదివాను. తిరిగి వీరి రచనలన్నీ – అనువాదాలు – పదేళ్ళ క్రిందట విశాలాంధ్ర ప్రచురణాలయం ద్వారా 10 వాల్యూములుగా వచ్చినవి నేను కొని చదివాను, అప్పటికి ఇప్పటికి అవగాహనలో ఎంతో వ్యత్యాసం! 1950 కేవలం పాఠకుడినే. ఇప్పుడు రచయితను, పాఠకుడినీ కూడ.

శరత్ కథలు, నవలల్లో పాత్రల స్వభావాన్ని ముందు ఎస్టాబ్లిష్ చేస్తాడు. ఇక వాటి ప్రవర్తనకు రచయిత జవాబుదారీ కాదు. ఇదే విధానాన్ని బాగా ఆలోచించి నా కథల్లోను, నవలల్లోను అమలుపరచాను. చాలా మంది రచయితలు ఇదే చేస్తూండవచ్చు. ఈ పరిస్థితుల్లో నాకు అనిపించింది ఏమిటంటే – "పాత్రల స్వభావాన్నిబట్టే వాళ్ళ ప్రవర్తన ఉంటుందని. అందువలన ఆయా పాత్రల అనుచిత ప్రవర్తనకు రచయితను తప్పపట్ట వలసిన అవసరం లేదు" అని.

ఈ నవల 'అనుబంధాలు–అనురాగాలు'లో ప్రధాన పాత్రలు ఇందిర, రవి. ఈ ఇద్దరూ భర్తృహరి పద్యం "తమకార్యంబు పరిత్యజించి పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్.ఎరుంగన్ శక్యమే ఏరికిన్" లో విభజించిన నాలుగు కేటగిరీలలోకి రారు. ఇక్కడ ఈ పద్యభావాన్ని క్లుప్తంగా విన్నవించడం అప్రస్తుతం కాబోదు. 1. 'తమ పనిని మాని ఇతరులకు సహాయపడేవారు సజ్జనులు. 2. తమ పనిని చేసుకుంటూనే ఇతరులకు సహాయపడే వారు మధ్యములు. 8. తమ కార్యసాధనకు ఇతరుల పనిని చెడగొట్టేవారు అధములు, 4. వృథాగా ఇతరుల పనులను చెడగొట్టేవారెవరో చెప్పలేము" అన్నాడు భర్తృహరి. కాని ఇంతటి గొప్ప కవి కూడ మరొక రకం మనుషులను కనుక్కోలేకపోయారు. పైన చెప్పిన పాత్రల స్వభావం– ముఖ్యం గా ఇందిర పాత్రధారి పై నాలుగు కేటగిరిలకు అందనిది. ఈమెకు తన పుట్టింటివారు కావాలి. భర్త పుట్టింటివారు అక్కర లేదు. భర్త పుట్టింటివాళ్లే కాదు, వాళ్ళ బంధువులు, స్నేహితులు కూడ అక్కరలేదు. ఈ మేరకు భర్తను తన దారిని నడపటంలో కృతకృత్యురాలైంది. ఇక్కడ ఒక విచిత్రమైన సంగతిని గమనించాలి. రవి స్వతహాగా నిబద్ధత గలవాడు. డబ్బుకు లొంగనివాడు. అతని కుటుంబ నేపథ్యం సంస్కారవంతమైనది. అయినా భార్య చెప్పుడు మాటలకు లొంగిపోయాడంటే "కుటుంబ నేపథ్యం తల్లిదండ్రుల సంస్కారము వ్యక్తుల మీద పనిచేయదా?" అనే అనుమానం కలుగుతోంది.

ఇందిర ప్రవర్తనకు కారణం ఆమె చెడ్డ స్వభావం కాదని కేవలం ఇన్ ఫీరియారిటీ కాంప్లెక్సే ప్రధాన కారణమని నేను భావించాను. కాంప్లెక్సు్లు – ఇన్ ఫీరియారిటీ, సుపీరియారిటీ – చెడ్డ లక్షణాలు కావని అందువలన ఆ కాంప్లెక్సు్లను తొలగిస్తే వాళ్ళ మామూలు మనుషులుగా తయారవ్వడానికి అవకాశముందని భావించి నేను చేసిన ప్రయత్నమే ఈ "అనుబంధాలు – అనురాగాలు' నవల.

ఈ నవలకు ముందు మాట రాయమని నా మిత్రుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శ్రీ అంపశయ్య నవీన్ని కోరాను. అద్భుతమైన ముందుమాట " చేసుకున్నవాళ్లకు చేసుకున్నంత" అన్న శీర్షికతో ఆయన రాసింది సరిగ్గా నా హృదయ కవాటాలను తెరచి, శోధించి రాసినట్లుగా నేను నమ్ముతున్నాను. శ్రీ అంపశయ్య నవీన్కు నేను ఆజన్మాంతం ఋణపడి ఉంటాను.

"అనుబంధాలు —— అనురాగాలు' నవలను ఆన్లైన్ పత్రిక కౌముది (అమెరికా)లో తీసుకుని రావడానికి అంగీకరించిన నా చిన్న మిత్రుడు, మేధావి బందరులో పుట్టి పెరిగిన కిరణ్ ప్రభ విశ్వవిఖ్యాతుడైనందుకు నాకు ఆనందం, గర్వం కలుగుతున్నాయి. ఇతనికి చేదోడు వాదోడుగా ఉన్న ఆయన సతీమణి మా అభిమాన పత్రిక చి| కాంతి కిరణ్ కూ నా ఆశీస్సులు,

కొట్టి రామారావు (పూర్వ అధ్యక్షుడు)

ఆంధ్రసారస్వతసమితి, మచిలీపట్నం సెల్ :9908789405

Post your comments